సాక్షి విశాఖపట్నం

శనివారం ¦ 23 ¦ సెప్టెంబర్ ¦ 2023



కోర్టు భవనాలు రెడీ
అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన న్యాయస్థానాల సముదాయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. 8లో



ఆధిక్యంలోకి సన్నిత్
వైజాగ్ ఓపెన్ గోల్ఫ్‌లో సన్నిత్ జూనియర్ లీడర్ బోర్డ్‌లో అగ్రస్థానానికి చేరుకోగా అక్షయ్ శర్మ, శివేంద్ర గట్టి పోటీనిస్తున్నారు. 8లో



రేపటి నుంచి పవిత్రోత్సవాలు
కనక మహాలక్ష్మి దేవస్థానంలో ఆదివారం నుంచి 27వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

చెస్ లోగో ఆవిష్కరణ



చెస్ లోగో ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విశాఖ స్పోర్ట్స్ : జాతీయస్థాయి అండర్ 11 చదరంగం చాంపియన్‌షిప్ లోగోను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో వచ్చే నెల 1 నుంచి ఏడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే దేశంలోని 27 రాష్ట్రాలకు చెందిన అండర్ 11 బాలబాలికలు 331మంది ఎంట్రీలను నమోదు చేసుకున్నారు. ఏపీ నుంచి 83 మంది తలపడుతున్నారు. ఈపోటీల నిర్వాహణ కమిటీకి చీఫ్ పాట్రన్‌గా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు వ్యవహరించనున్నారు.

ముగిసిన వ్యాయామ విద్య విభాగ వార్షిక సమావేశం

విశాఖ స్పోర్ట్స్ : ఏయూ వ్యాయామవిద్య విభాగ వార్షిక సమావేశం శుక్రవారం జరిగింది. విభాగపు సమావేశం మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ పరిధిలోని కళాశాలల వ్యాయామ విద్య పీడీ, లెక్చరర్స్ పాల్గొన్నారు. సమావేశానికి విభాగపు సంచాలకుడు విజయ్‌మోహన్ మాట్లాడుతూ ఆల్‌ఇండియా వర్సిటీల రోలర్ స్కేటింగ్ మూడోసారి ఏయూ వేదికగా నిలవనుందన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది నిర్వహించే అంతర కళాశాలల పోటీలు, సెలక్షన్ ట్రయిల్స్ పై చర్చించారు. ప్రతిభ కనబరిచిన ఏయూ క్రీడాకారులకు వీసీ ప్రసాదరెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారన్నారు. విభాగపు హెడ్ ఎ.పల్లవి మాట్లాడుతూ ఈఏడాది క్రీడా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏయూలో అన్ని క్రీడలు నిర్వహించేవిధంగా సౌకర్యాలున్నాయన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో) పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సభ్యులు, అధికారులు హాజరు కావాలని సీఈవో కోరారు.

జాబ్‌మేళాలో 121 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. వాల్ మార్ట్, బిగ్ సీ మొబైల్స్, మెడ్ ప్లస్, బిగ్ బాస్కెట్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, మహాదేవ్ షిప్పింగ్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో మొత్తం 695 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 237 మంది అభ్యర్థులు హాజరుకాగా..121 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సాహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జులై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును ఇగ్నో పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignou admission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువును పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.




ప్రయోగాత్మక చర్యల ఫలితం..

- 2022లో జనవరి–ఆగస్టు వరకు 996..
- ఈ ఏడాది ఇప్పటి వరకు 767 రోడ్డు ప్రమాదాలు
- రహదారి భద్రత పనులకు రూ.21 కోట్ల వ్యయం
- రాష్ట్రంలో ప్రమాదాలు తగ్గిన జిల్లాగా విశాఖ టాప్
- ఫలితమిస్తున్న భద్రతా చర్యలు

ప్రమాదాలకు కళ్లెం

సాక్షి, విశాఖపట్నం:

రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. అధికారులు చేపట్టిన భద్రతా చర్యలు ఫలితమిస్తున్నాయి. గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు విశాఖ జిల్లాలో 996 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఏడాది అదే సమయంలో 767 సంభవించాయి. అంటే గతేడాదితో పోల్చుకుంటే 229 ప్రమాదాలు (23 శాతం) తగ్గాయన్న మాట! దీంతో ఎక్కువ ప్రమాదాలు తగ్గించిన జిల్లాగా విశాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రహదారి భద్రతా చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తరచూ భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు రహదారి భద్రతా పనులకు ఇప్పటివరకు రూ.21 కోట్లు వెచ్చించారు. ఇందులో స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు లైన్ మార్కింగులకు రూ.1.17 కోట్లు, గుంతల మరమ్మతులకు రూ.8 కోట్లు, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధికి రూ.11.40 కోట్లు, జంక్షన్ల అభివృద్ధికి రూ.43.30 లక్షలు, అండర్ పాస్‌ల అభివృద్ధికి రూ.42.50 లక్షలు, మీడియన్ గ్రిల్ నిర్మాణాలకు రూ.1.38 కోట్లు, రహదారి వెంబడి లైటింగ్‌కు రూ.54.05 లక్షలు ఖర్చు చేశారు. అంతేకాదు రహదారి భద్రత కోసం జీవీఎంసీ చేపట్టిన పలు పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



4,145 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

మరోవైపు పోలీసులు, రవాణా శాఖల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర రహదారి భద్రత ఉల్లంఘనలపై తరచూ కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,145 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టి రూ.50.88 లక్షల జరిమానా విధించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన వీరందరి డ్రైవింగ్ లైసెన్సులను మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. మరికొంత మందికి సమాజ సేవ శిక్షను అమలు చేశారు. ఇంకా రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు సంయుక్తంగా ఎప్పటికప్పుడు కాలేజీలు, స్కూళ్లలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలా రహదారి భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు భద్రత పనులకు నిధులు వెచ్చిస్తుండడంతో ఈ ఏడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సి.రాజారత్నం తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించడానికి అంతా సహకరించాలని ఆయన కోరారు.

సోషల్ మీడియా మాయలో పడొద్దు



విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాన్సీ ప్రీత్ కౌర్

పెదగంట్యాడ : సామాజిక మాధ్యమాల మాయలో పడి మనిషి మనుగడ కోల్పోకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) జాతీయ సమన్వయకర్త డాక్టర్ నాన్సీ ప్రీత్ కౌర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులలో ముఖ్య వక్తగా పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల ఉచ్చులో పడి యువత ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, మానసికంగా ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఇన్సా సురక్ష పథకంలో భాగంగా ఐదు రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సామాజిక మాధ్యమాల ప్రభావం సమాజంపై ఎలా ఉందనే విషయంపై అవగాహన కల్పించారు. వలంటీర్ అసోసియేషన్ ఇండియా ముఖ్య నిర్వాహణ అధికారి ఆచార్య భావనా మాట్లాడుతూ రాష్ట్రంలో 15 పాఠశాలలను ఎంపిక చేసుకుని ప్రయివేట్ ప్రాజెక్టుగా దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇస్మాయిల్, సతీష్, ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకోండ శ్రీనివాస్, నారాయణ, మంగమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌కు 27 మంది కొత్త వైద్యులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు 27 మంది కొత్త వైద్యులు రానున్నారు. ఈనెల 21న విమ్స్‌లో 43 మంది సూపర్ స్పెషాలిటీ, జనరల్ వైద్యులను నియమించడానికి ఏపీ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 27 మందిని ఎంపిక చేసినట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. మొత్తం 65 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. రోస్టర్ పాయింట్లు సరిపోకపోవడంతో అవసరమైన మరో 16 మందిని ఎంపిక చేయడానికి వీలుపడలేదన్నారు. దీనిపై నివేదిక తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన 27 మందిలో 12 మంది సూపర్ స్పెషాలిటీ, 15 మంది జనరల్ వైద్యులు ఉన్నట్లు తెలిపారు. వారందరూ వారంలోగా విధుల్లో చేరాల్సి ఉందన్నారు.

25, 26 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ, జయలక్ష్మి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ సాహిత్య భారతీ సౌజన్యంతో ఈ నెల 25, 26 తేదీల్లో భారతీయ సాహిత్యం, ఆధ్యాత్మికత అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ బహుభాషా సదస్సు నిర్వహించనున్నట్లు కన్వీనర్, ద్వితీయ భాషా విభాగ అధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం కళాశాల సెమినార్ హాల్‌లో సదస్సు పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ షైజీ మాట్లాడుతూ కొరియా, సౌత్ ఆఫ్రికా నుంచి వక్తలతో పాటు ఏయూ తెలుగు విభాగ పూర్వ ఆచార్యుడు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, హిందీ సాహిత్య భారతి వ్యవస్థాపకుడు ఉత్తర ప్రదేశ్ పూర్వ విద్యాశాఖా మంత్రి డాక్టర్ రవీంద్ర శుక్ల, డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ సుమన్‌లత ప్రసంగించనున్నారన్నారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని జయలక్ష్మి సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 92473-62689లో సంప్రదించాలన్నారు.

రూ.5 కోట్లకు పైగా పనులకు ఆమోదం



స్థాయీ సంఘ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న సభ్యులు

మేయర్ అధ్యక్షతన జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో రూ.5 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘం అజెండాల్లో 20 అంశాలు, ఒక టేబుల్ అజెండాతో మొత్తం 21 అంశాలు పొందుపరచగా, అన్నింటినీ చర్చించి ఆమోదం తెలిపారన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారుగా రూ.4.77 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రూ.86.58 లక్షల పనులకు ఆమోదం తెలిపారని, రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు, పొడిగింపులతో పాటు తదితర అంశాలకు ఆమోదం లభించిందన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీ(రెవెన్యూ) ఫణీరామ్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, ఎస్‌వీ రమణ, శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ ప్రసాదబాబు, ఏఎంహెచ్‌వో సత్యనారాయణ, బయాలజిస్ట్ సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో ప్రజా సమస్యల పరిష్కారం



జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన అధికారులు



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

- కలెక్టర్ మల్లికార్జున
- 60 అర్జీల స్వీకరణ

పీఎం పాలెం: ప్రజల నుంచి వచ్చిన వివిధ వ్యక్తిగత, సామాజిక సమస్యలను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో శుక్రవారం రూరల్ మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే స్పందన కార్యక్రమానికి అనుసంధానంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో స్వీకరించిన అర్జీలను నియమిత కాల వ్యవధిలో నూరు శాతం పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఈ నెల 8 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఉండాలంటే అర్జీలో పేర్కొన్న సమస్యపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన ప్రతి అర్జీని సాంకేతికత సాయంతో జేకేసీ పోర్టల్‌లో నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్, వార్డు ప్రజల నుంచి 60 అర్జీలు అందగా.. వాటిలో రెవెన్యూ, హౌసింగ్‌కు సంబంధించి ఎక్కువగా ఉన్నాయన్నారు. జేసీ కేఎస్ విశ్వనాథన్, ఆర్‌డీవో భాస్కరరెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, జెడ్పీ కనకమహాలక్ష్మి, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

25 నుంచి పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ బాపట్ల స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేరు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. బొకారో ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు. ఈ నెల 25, అక్టోబర్ 2, 9 తేదీల్లో విశాఖపట్నం–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22869) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26, అక్టోబర్ 3, 10 తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–విశాఖపట్నం (22870) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27, అక్టోబర్ 4వ తేదీల్లో సంబల్‌పూర్–ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, అక్టోబర్ 6వ తేదీల్లో ఈరోడ్–సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, అక్టోబర్ 1, 8 తేదీల్లో విశాఖపట్నం–బెంగళూరు కంటోన్మెంట్ (08543) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25, అక్టోబర్ 2, 9 తేదీల్లో బెంగళూరు కంటోన్మెంట్–విశాఖపట్నం (08544) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అక్టోబర్ 4, 6, 8 తేదీల్లో తిరుపతి–విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 5, 7, 9 తేదీల్లో విశాఖపట్నం–తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30, అక్టోబర్ 7వ తేదీల్లో భువనేశ్వర్– తిరుపతి(02809)ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 1, 8 తేదీల్లో తిరుపతి–భువనేశ్వర్ (02810) ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 8న భువనేశ్వర్–తిరుపతి (22871) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 9న తిరుపతి–భువనేశ్వర్ (22872) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

ధన్‌బాద్–అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలు ఆయా తేదీల్లో తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణించదు.

- పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ నిర్వహించిన ఎన్నికల బృందం
- జిల్లాలో అదనంగా 27 పోలింగ్ స్టేషన్లు
- భీమిలిలో అత్యధికం.. పశ్చిమంలో అత్యల్ప పోలింగ్ స్టేషన్లు
- అక్టోబర్ 17న ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్

సార్వత్రిక ఎన్నికల కీలక ప్రక్రియ పూర్తి

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో ఏ ఒక్కరి ఓటు పోనివ్వకుండా.. పకడ్బందీగా ముసాయిదా రూపకల్పనలో జిల్లా ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. మరోవైపు సార్వత్రిక ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు అవసరమైన ప్రక్రియలు ఒక్కొక్కటీ పూర్తి చేస్తున్నారు. 50 రోజుల పాటు ఇంటింటి ఓటరు సర్వే ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు దానికనుగుణంగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) కూడా పూర్తి చేశారు. దీని ప్రకారం ప్రస్తుతం 1945 పోలింగ్ కేంద్రాలుండగా రేషనలైజేషన్ తర్వాత జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికలకు 1941 పోలింగ్ కేంద్రాలుండనున్నాయి. భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 348 పోలింగ్ స్టేషన్లుండగా విశాఖ పశ్చిమంలో అత్యల్పంగా 220 కేంద్రాలున్నాయి. ఓటర్ల జాబితా మదింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తున్న ఎన్నికల కమిషన్ అక్టోబర్ 17న ఎలక్టోరల్ రోల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ కానుంది.

2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అడ్డగోలుగా నకిలీ ఓటర్లని చేర్పించి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించింది. ఈ ఎన్నికల్లో అలాంటి తప్పులు దొర్లకుండా.. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ జరగాలని, ఏ ఒక్క నకిలీ ఓటు ఓటర్ల జాబితాలోకి రాకుండా ప్రతి ఓటును ఎన్నికల కమిషన్ విభిన్న దశల్లో పరిశీలన చేస్తోంది. జూలై 21 నుంచి ఎస్ఎస్ఆర్–2024 కార్యక్రమం మొదలైంది. 50 రోజుల పాటు ఇంటింట ఓటర్ల పరిశీలన నిర్వహించారు. బీఎల్‌వోలు బీఎల్ఏల సమక్షంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించడం, కొత్త ఓట్లు నమోదు, ఇంటి నంబర్ ప్రకారం ఓటర్లు లేకపోతే.. వారి వివరాలు ఆరా తీసి ఓటును ఉంచాలా, తీసెయ్యాలా, లేదా వేరే చోటుకు ట్రాన్స్‌ఫర్ చేయాలా అనే వివరాలు సేకరించారు. ఓటర్లు చిరునామా, పేర్లు, ఫొటోలు, సరిచూసి.. శతశాతం కచ్చితమైన నమోదు జరిగేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా డెత్ ఓటర్లను కూడా తొలగించే ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నారు. దీని ప్రకారం పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ చేపట్టారు.

1941 పోలింగ్ స్టేషన్లు..

జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1945 పోలింగ్ కేంద్రాలున్నాయి. రేషనలైజేషన్ తర్వాత అదనంగా 27 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే 212 పోలింగ్ కేంద్రాలలో లొకేషన్ మార్పిడి, 157 కేంద్రాలలో పేరు మార్పులు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా తీసుకున్న ఓటర్ల జాబితా ప్రకారం 31 కేంద్రాల్ని తొలిగించారు. ఈ విధంగా రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మొత్తం 1941 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లుగా ఎన్నికల అధికారులు నిర్ధారించారు. ఎన్నికల కమిషన్ సూచనలు ప్రకారం పోలింగ్ స్టేషన్లో ఉండాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. భవనాలు పాడైనా, సౌకర్యాలు లేకపోయినా ఆ పోలింగ్ స్టేషన్ల లొకేషన్లు మార్పులు చేశారు. 2 కిలోమీటర్ల దూరం మించితే కొత్త కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఒక్కో పోలింగ్ స్టేషన్‌కి 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. అర్బన్ పరిధిలో ఒకే చోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలు లేకుండా సర్దుబాటు చేశారు.

అక్టోబర్ 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్...

ఇంటింట పరిశీలన ముగిసిన తర్వాత ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం.. మార్పులు చేర్పులు జరిగిన తర్వాత అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యాంపులు కూడా ఏర్పాటు చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారులు సమాయత్తమవుతున్నారు. అక్టోబర్ 28,29, నవంబర్ 18,19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు తీసుకునే బాధ్యతని బీఎల్‌వోలుకు అప్పగించనున్నారు. వాటి పర్యవేక్షణని ఈఆర్వోలు చేపడతారు. డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించి పరిష్కరించనున్నారు.



అధికారులు, రాజకీయ పార్టీలతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున (ఫైల్)

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ జరిగిందిలా..

నియోజకవర్గం	ప్రస్తుతం	లొకేషన్	పేర్లు మార్చినవి	కొత్తవి మార్పు	తొలగించినవి	తుది స్టేషన్లు
భీమిలి	335	41	39	13	00	348
విశాఖ తూర్పు	282	16	03	00	00	282
విశాఖ దక్షిణం	235	03	00	00	00	235
విశాఖ ఉత్తరం	271	17	05	01	00	272
విశాఖ పశ్చిమం	237	18	23	04	21	220
గాజువాక	305	85	87	07	10	302
పెందుర్తి	280	32	00	02	00	282
మొత్తం	1945	212	157	27	31	1941

జనవరి 5న ఓటర్ల తుది జాబితా

జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించి ఏఈఆర్వో , ఈఆర్వోల స్థాయిలో నియోజక వర్గాల్లో సమావేశాలను నిర్వహించాం. ఆ నివేదికలకు అనుగుణంగా జిల్లాలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేశాం. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపైనా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించాం. 2024 జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం జనవరి 5న తుది జాబితాను ప్రకటిస్తాం. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఏ ఒక్కరి ఓటు పోకుండా ఉండాలనే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. తప్పులు లేని జాబితా తయారు చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేస్తున్నాం.

– డా.మల్లికార్జున, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

జీవీఎంసీ కార్యాలయాన్ని ఇప్పుడు తరలించడం లేదు

• డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్

దాబాగార్డెన్స్: విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు స్వాగతిస్తున్నారని జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. విశాఖలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి.. దసరా నుంచి పరిపాలన ప్రారంభిద్దామని సీఎం.. మంత్రులకు స్పష్టం చేసిన నేపథ్యంలో విశాఖ వాసులతో పాటు ఉత్తరాంధ్ర ప్రజానీకంలో సంతోషం వెల్లివిరిసిందన్నారు. జీవీఎంసీని ముడసర్లోవ తరలిస్తారని పలు పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందిస్తూ.. ముడసర్లోవలో జీవీఎంసీకి 5 ఎకరాల 6 సెంట్ల భూమి ఉందని, త్వరలోనే అక్కడ ఏడు అంతస్తుల భవనం నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం డీపీఆర్ రూపొందుతోందని.. అయితే జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడి నుంచి ఇప్పుడు తరలించబోమన్నారు. కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించేందుకు కొంత సమయం పడుతుందని వారు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్

మూర్తి యాదవ్ ఆరోపణలు మానుకో..

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పలువురు అధికారులపై చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని వారు సూచించారు. నీ ఆరోపణలతో జీవీఎంసీ పరువు తీయడం భావ్యం కాదని మూర్తి యాదవ్‌కు హితవు పలికారు. యూసీడీ పీడీపై చేస్తున్న ఆరోపణలపై ఆధారాలుంటే వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎంసీ అధికారులు అతని తీరు వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. మేయర్, కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అతను చెప్పడం సిగ్గు చేటన్నారు. నిరాహార దీక్ష చేయాలని ఉంటే.. జనసేన పార్టీ కార్యాలయంలో చేసుకోవాలని అతనికి సూచించారు.

కోర్టు భవనాలు రెడీ

రేపు ప్రారంభించనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్



అత్యాధునికంగా నిర్మించిన న్యాయస్థానాల సముదాయం

విశాఖ–లీగల్ : అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన న్యాయస్థానాల సముదాయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సముదాయాన్ని ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఈ భవనంలోకి పది న్యాయస్థానాలను తరలించనున్నారు. జీ ప్లస్ త్రీ తరహాలో నిర్మించిన ఈ భవనంలో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్ మొదటి, రెండు అంతస్తులున్నాయి. న్యాయవాదులకు ప్రత్యేక హాలు, మహిళా న్యాయమూర్తులకు ప్రత్యేక మందిరం, కక్షిదారులకు ప్రత్యేక సౌచాలయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. రూ. 26 కోట్లతో 2019లో ప్రారంభించిన ఈ భవనాల్లో దసరా సెలవులు నాటికి పూర్తి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆరో అదనపు జిల్లా కోర్టు నుంచి అన్ని అదనపు జిల్లా కోర్టులు, కుటుంబ న్యాయస్థానాలు కొన్ని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఇక్కడికి తరలిస్తున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్టు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, విశాఖ న్యాయస్థానాల పోర్టు పోలియో న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌తోపాటు పలువురు ఇతర హైకోర్టు న్యాయమూర్తులు హాజరవుతున్నారు.

ఎన్నో మార్పులు.. : ఎన్నో మార్పులతో 2019లో ప్రారంభమైన ఈ భవనాలు నాలుగేళ్ల విరామం తర్వాత ప్రారంభానికి సిద్ధమయ్యాయి. గతంలో బ్రిటిష్ భవనాల్లో న్యాయస్థానాలు ఉండేవి. మెజిస్ట్రేట్ కోర్టు విస్తరణలో భాగంగా 1986లో కొత్తగా కొన్ని భవనాలను నిర్మించారు. వాటన్నింటిని తొలగించి రెండున్నర ఎకరాల ప్రాంతంలో ఈ నూతన భవనాలు ఏర్పాటయ్యాయి. దసరా తర్వాత న్యాయస్థానాలు నూతన భవనాల్లో యథాతథంగా పని చేస్తాయి. విశాఖలో భవిష్యత్తులో హైకోర్టు బెంచి వస్తే తక్షణ ఏర్పాట్లకు నూతన భవనాలను ఉపయోగించుకునే అవకాశం కూడా ఉంది. అందుకు తగ్గట్టుగానే భవనాల నిర్మాణం కూడా సువిశాలంగా ఉన్నాయని సీనియర్ న్యాయవాది గోలి శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

సుబ్బారెడ్డిని కలిసిన రాఘవేంద్ర కంటి ఆస్పత్రి అధినేత



మహారాణిపేట: వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో వైజాగ్ రాఘవేంద్ర కంటి ఆస్పత్రి అధినేత పోలా అజయ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పలు విషయాలపై కాసేపు చర్చించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్):	రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)	
విశాఖ	520.00
విజయనగరం	524.00
శ్రీకాకుళం	524.00

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

గోపాలపట్నం: గోపాలపట్నం శ్రీరామ్‌నగర్ బ్లాక్–1లో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు. గోపాలపట్నం క్రైం పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలివీ.. శ్రీరామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం జరిగిన పూజల్లో శరగడం రాజేశ్వరి(65) పాల్గొంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలో బైక్‌పై హెల్మెట్ ధరించిన ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల రెండు పేటల



వివరాలు సేకరిస్తున్న డీసీపీ నాగన్న

గొలుసును తెంచుకుని పరారయ్యారు. వెంటనే ఆమె కేకలు వేయడంతో స్థానికులు సంఘటన వచ్చినా ఫలితం లేకపోయింది. దొంగతనానికి పాల్పడిన వారు రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న డీసీపీ నాగన్న, ఏడీసీపీ గంగాధర్, ఏసీపీ సునీల్, సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐలు నర్సింగరాజు, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని.. వివరాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజీలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

పీఎంపాలెం: దారి దోపిడీకి పాల్పడిన కేసులో న్యాయస్థానం ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. పీఎంపాలెం క్రైం ఎస్ఐ రంబ శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. 2020 సెప్టెంబర్ 22వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో నగరం నుంచి వస్తున్న ఆటోను క్రికెట్ స్టేడియం సమీపంలో సవడల లక్ష్మీ నరసింహమూర్తి, గాజుల దుర్గా సాయిరామ్ అటకాయించారు. ఆటో డ్రైవర్‌పై దౌర్జన్యం చేసి రూ.15 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను గుర్తించారు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న భీమిలి 16వ ఏఎంఎం కోర్టు న్యాయమూర్తి సీహెచ్ పవన్ కుమార్ నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసును ఏపీపీ కె. విమల్‌రాథోడ్ వాదించారు.

ఆధిక్యంలోకి దూసుకొచ్చిన సన్హిత్

• కొనసాగుతున్న వైజాగ్ ఓపెన్ గోల్ఫ్

విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ ఓపెన్ గోల్ఫ్‌లో సన్హిత్ బిష్టోయ్ లీడర్ బోర్డులో అగ్రస్థానానికి చేరుకోగా అక్షయ్ శర్మ, శివేంద్ర సింగ్ గట్టి పోటీనిస్తున్నారు. భారత్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్‌లో భాగంగా ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ కోర్స్‌లో శుక్రవారం మూడో రోజు మూడో రౌండ్ పోటీలు జరిగాయి. అండర్–9 స్కోర్ 207 పాయింట్లతో మెరిట్ ఆర్డర్ లీడర్ సన్హిత్ బిష్టోయ్ ఆధిక్యాన్ని అందుకున్నాడు. గురుగ్రామ్‌కు చెందిన సన్హిత్ బిష్టోయ్ 69 పాయింట్లతో (అండర్ 3) మూడోరౌండ్‌లో ఆధిక్యంలోకి వచ్చాడు. మూడో వరుస 69 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న అక్షయ్ శర్మ(67–68)పై ఓ షాట్‌లో ఆధిక్యాన్ని ప్రదర్శించి రెండో టైటిల్ సొంతం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఆట సగం దశలో అక్షయ్‌తో రెండు, మూడు షాట్లతో పోటీపడి మొదటి ఏడు హోల్స్‌పై గ్రైండ్ చేశాడు. ఓవర్‌నైట్ లీడర్ అక్షయ్‌తో ఉన్న గ్యాప్‌ను పూడ్చేందుకు ఐదో హోల్‌లో 25 అడుగుల దూరంలో రెండు బర్డీలు సాధించాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో సాలిడ్ హిట్టింగ్స్‌తో సన్హిత్ లీడర్ బోర్డులో అగ్రస్థానానికి చేరుకున్నాడు. హాఫ్‌వే లీడర్‌గా ఉన్న అక్షయ్‌శర్మ(చండీగఢ్) అండర్–8 స్కోర్ 208 పాయింట్లతో ద్వితీయస్థానానికి పడిపోయాడు. గురుగ్రామ్‌కే చెందిన శివేంద్ర సింగ్ మూడోరౌండ్‌లో నాలుగు బర్డీలు, నాలుగు బోగీలతో అండర్–6 స్కోర్ 210 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. త్రిశూల్ చిన్నప్ప(బెంగళూరు) అండర్–5 స్కోర్ 211 పాయింట్లతో, సార్థక్ చిన్నప్ప(ఢిల్లీ) అండర్–4 స్కోర్ 212 పాయింట్లతో వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. హరేంద్ర గుప్తా (చండీగఢ్), మెరిట్ ఆర్డర్ లీడర్ ఓం ప్రకాష్ చౌహాన్(ఎంహెచ్‌ఓడబ్ల్యూ), మహమ్మద్ సంజు (కోల్‌కతా) 213 పాయింట్లతో సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచి తుదిరౌండ్‌కు సిద్ధపడుతున్నారు. ఇక 214 పాయింట్లతో రాజీవ్ కుమార్, రోహన్ దోలే, సమర్థ్ ద్వివేది, గౌరవ్ ప్రతాప్, తంగరాజా(శ్రీలంక) అండర్–2 స్కోర్‌తో టాప్ 10లో నిలిచి నాలుగో రౌండ్‌కు చేరుకున్నారు. సయ్యద్, అంగద్, కెవిన్ ఎస్టీవ్(అండోరా), అన్షుల్, ఒలింపియన్ ఉదయన్ మనే (పుణె), ఆదిల్ అండర్–1 స్కోర్ 215 పాయింట్లతో... భస్వర్‌పాల్ సింగ్, అమన్, శుక్రబహాదూర్ (నేపాల్), ముత్తు 216 పాయింట్లు(పార్‌తో) టాప్ 20లో నిలిచి చివరి రౌండ్‌కు సిద్ధమవుతున్నారు. స్థానిక గోల్ఫర్ రెహమాన్ 229 పాయింట్లతో 53వ స్థానంలో కొనసాగుతున్నాడు.



టాప్ 20లో నిలిచిన భస్వర్‌పాల్‌సింగ్

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది చేతివాటం

తగరపువలస: ఐఐఎఫ్ఎల్(ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్ కంపెనీ) స్థానిక శాఖలో ఖాతాదారుడు తనఖా పెట్టిన బంగారు ఆభరణాలను సిబ్బందిలో ఒకరు కాజేసిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మూడు రోజులుగా ఇక్కడి బ్రాంచ్‌లో ఆడిటింగ్ జరుగుతుండగా.. వలందపేటకు చెందిన నీలాపు శివశంకరరెడ్డి అనే మాజీ సైనికుడు దఫదఫాలుగా తాకట్టులో ఉంచిన బంగారంలో ఓ ప్యాకెట్ కనిపించలేదు. దీనిపై సంస్థ ఉన్నతాధికారులు శుక్రవారం రహస్యంగా విచారించగా.. చిల్లపేటకు చెందిన ఓ ఉద్యోగి వీటిని కాజేసినట్టు రుజువైంది. తగరపువలసలోనే ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు అయిన కీర్తన, మణప్పురం బ్రాంచ్‌ల్లో అక్కడి ఉద్యోగుల సాయంతో ఈ ఆభరణాలు తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నాడు. ఐఐఎఫ్ఎల్‌లో తప్పించిన ఆభరణాలు తమ వద్ద ఉన్నాయని తెలుసుకున్న కీర్తన ఉద్యోగి ఒకరు శివశంకరరెడ్డికి శుక్రవారం సాయంత్రం ఫోన్ చేశాడు. ఐఐఎఫ్ఎల్‌లో తాకట్టులో ఉంచిన ఆభరణాల పత్రాలు తీసుకుని నమ్మివానిపేట శివారులో తనను కలవాలని లొకేషన్ షేర్ చేశాడు. అక్కడకు చేరుకున్న శివశంకర్‌రెడ్డికి వివరాలు తెలియచేస్తూ డబ్బులు చెల్లించి విడిపించుకోవాలని చెప్పాడు. దీంతో శివశంకర్‌రెడ్డి తాను ఐఐఎఫ్ఎల్‌లో ఆభరణాలు తనఖా పెట్టానని.. అక్కడే విడిపించుకుంటానని అతనికి స్పష్టం చేశాడు. తర్వాత ఐఐఎఫ్ఎల్ బ్రాంచ్‌లో ఆరా తీయగా సిబ్బంది చేతివాటం నిజమేనని తేలింది. ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్‌లో ఇంకా ఎందరి ఆభరణాలు బ్రాంచ్ దాటిపోయాయోనని ఆందోళన చెందుతున్నారు.

నాణ్యమైన శిక్షణతో ప్రజలకు మెరుగైన భద్రత


• డీఐజీ రాజకుమారి



శిక్షణ కేంద్రంలో పర్యటిస్తున్న డీఐజీ రాజకుమారి

పీఎంపాలెం: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలోని ఏపీఎస్పీ పోలీస్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం డీఐజీ రాజకుమారి సందర్శించారు. బెటాలియన్ నిర్వహణ, పోలీస్ శిక్షణ తదితర అంశాలపై 16వ పోలీస్ బెటాలియన్ కమాండర్ గౌతమీ శాలితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన శిక్షణతో ప్రజలకు మెరుగైన రక్షణ, భద్రత సేవలు అందించగలమన్నారు. అడిషనల్ కమాండెంట్ శ్యామ్యూల్ జాన్, అసిస్టెంట్ కమాండెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విభాష్యంకు సతీ వియోగం



ద్విభాష్యం సీత(ఫైల్)

సీతంపేట: ప్రముఖ కథా రచయిత, విశాఖ సాహితీ సంస్థ గౌరవ అధ్యక్షుడు ద్విభాష్యం రాజేశ్వరరావు సతీమణి సీత అనారోగ్యంతో గురువారం రాత్రి కన్నుమూశారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విశాఖ సాహితీ, విశాఖ రచయితల సంఘం, రైటర్స్ అకాడమీ సభ్యులు, పలువురు సాహితీ వేత్తలు ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. అతన్ని ఓదార్చారు.

రేపటి నుంచి కనకమహాలక్ష్మి పవిత్రోత్సవాలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన పవిత్రాలను సిద్ధం చేశారు. వాటిని వేద పండితులు పర్యవేక్షిస్తున్నారు. వార్షిక ఉత్సవాల్లో వైదికపరంగా ఎలాంటి దోషాలు, పొరపాట్లు జరిగినా వాటిని నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు. చివరి రోజున పవిత్ర విసర్జన, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం అనంతరం భక్తులకు గర్భాలయ దర్శనం ఉంటుంది. పవిత్రోత్సవాలు సందర్భంగా ఈ నెల 26న ఉదయం 9 నుంచి 27వ తేదీ ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు, పంచామృతాభిషేక సేవలు నిలిపివేస్తున్నట్లు ఈవో కె.శిరీష తెలిపారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

బీచ్‌రోడ్డు: సాగరతీరంలోని హవామహల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. నగరంలో పలువురు చిత్రకారులు గీసిన చిత్రాలను ఇక్కడ ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు ప్రారంభించారు. కళాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకురాలు మహంక్ కుమారి మాట్లాడుతూ ఈ ప్రదర్శన శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటలకు వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న అదనపు కమిషనర్

వైద్యులకు తెల్లకోటే గౌరవం



వైద్య విద్యార్థికి వైట్ కోట్ వేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ)లో కొత్తగా చేరిన వైద్య విద్యార్థులకు శుక్రవారం వైట్ కోట్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ వైద్యులకు తెల్లకోటే గౌరవమని, విలువైన వైద్య వృత్తిని వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక స్పృహతో చూడాలని మెడికోలకు సూచించారు. వైద్య విద్యను క్రమశిక్షణతో అభ్యసించాలని.. విద్యా కాలంలో నైపుణ్యం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రమాణం చేయించి, వారికి వైట్‌కోట్ వేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్(అడ్మిన్) డాక్టర్ మన్మథరావు, పలు విభాగాల అధిపతులు డాక్టర్ భవానీ, డాక్టర్ పద్మ గీతాంజలి, డాక్టర్ రవీంద్ర కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్యదర్శి దృష్టికి స్టీల్‌ప్లాంట్ సమస్యలు

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాతో బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు శుక్రవారం భేటీ అయ్యారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన చర్చించారు. ఆర్ఐఎన్ఎల్ బోర్డు ద్వారా ప్రమోషన్ పాలసీని ఖరారు చేయడంలో జాప్యం కారణంగా 2019 నుంచి పెండింగులో ఉన్న ఎగ్జిక్యూటివ్‌ల పదోన్నతుల వ్యవహారాన్ని ఆయన దృష్టికి జీవీఎల్ తీసుకెళ్లారు. పలువురు యువ ఇంజినీర్లు 2012లో ప్రీమియర్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఎన్నో ఆశలతో స్టీల్ ప్లాంట్‌లో చేరారని, 2021 నుంచి టైం బౌండ్ పదోన్నతులు ఇవ్వకపోవడంతో వీరిలో నైతిక స్థైర్యం దెబ్బతిందన్నారు. ఆర్ఐఎన్ఎల్ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడంపైనా చర్చించారు. అలాగే ఎన్ఎండీసీ నుంచి ఇనుప ఖనిజం సరఫరా అంశాన్ని కూడా ఉక్కు కార్యదర్శికి వివరించారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీ జీవీఎల్ తెలిపారు. ఎంపీ వెంట స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ తదితరులున్నారు.



ఉక్కు కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ జీవీఎల్

శరవేగంగా ఐఎన్ఎస్ నిస్తార్ నిర్మాణం

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో డైవింగ్ సపోర్ట్ వెసల్ ఐఎన్ఎస్ నిస్తార్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ నిస్తార్ నిర్మాణంలో భాగంగా ఇంటర్నల్ షాఫ్ట్ టర్న్ పనితీరుపై నిర్వహించిన ట్రయల్ విజయవంతమైనట్లు అధికారులు తెలిపారు. గేర్ బాక్స్‌కు సంబంధించిన పనుల పూర్తి కావడంతో మిగిలిన పనులను త్వరితగతిన చేపడతామని పేర్కొన్నారు.



నిర్మాణ దశలో ఉన్న ఐఎన్ఎస్ నిస్తార్ నౌక

మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రం తనిఖీ

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం విశాఖపట్నం మర్రిపాలెంలో గల మల్టీడిసిప్లినరీ శిక్షణ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. శిక్షణ కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతీ ఒక్కరూ దేశ నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. శిక్షణ పొందుతున్న లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, అసిస్టెంట్ లోకో పైలట్లతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.